# గీతన్నల చైతన్య యాత్రను సక్సెస్ చేయండి

## కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య

**జనగామ, జూలై 25 (మన చౌరాస్తా) :** తెలంగాణలో కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన ధర్మ భిక్షం, బైరు మల్లయ్య తదితర నాయకుల ఆశయాలను స్మరిస్తూ.. మహబూబాబాద్ జిల్లాలో ఆగస్టు 2 నుంచి 18 వరకు నిర్వహించనున్న 'అమరుల యాదిలో గీతన్నల చైతన్య బస్సు యాత్ర'ను విజయవంతం చేయాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నే వెంకట మల్లయ్య పిలుపునిచ్చారు. శనివారం జనగామ మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్, వెంకిర్యాల గ్రామాల్లో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బాల్నే ఉమాపతి, తాళ్లపల్లి అశోక్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకట మల్లయ్య బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు.



**ప్రధాన డిమాండ్లు**

- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లవుతున్నా గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని మండిపడ్డారు.
- ఎక్స్ గ్రేషియాను రూ. 5 లక్షల నుండి రూ. 10 లక్షలకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు.
- పింఛను రూ. 4,000లకు పెంచి, 50 ఏళ్లు నిండిన ప్రతి గీత కార్మికునికి ఎలాంటి షరతులు లేకుండా అందించాలని డిమాండ్ చేశారు.
- ప్రతి గ్రామంలో జీవో ప్రకారం 5 ఎకరాల భూమి కేటాయించాలని, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని కోరారు.

ఆగస్టు 10న జనగామలో బహిరంగ సభ: ఆగస్టు 10న జనగామ జిల్లా కేంద్రంలో ఉదయం 11 గంటలకు భారీ బహిరంగ సభ జరగనుందని మండల అధ్యక్షుడు బాల్నే ఉమాపతి తెలిపారు. జనగామ మండలం నుంచి గీత కార్మికులు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీగా తరలివచ్చి ఈ యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేజీకేఎస్, టీజీఎస్ నాయకులు నామాల ఎల్లేష్, బాల్నే ఆంజనేయులు, తాళ్లపల్లి అంజయ్య, యాదగిరి, నమిలి శివ, నామాల భాస్కర్, నామాల రవి, తాళ్లపల్లి బుజ్జి రాములు, అశోక్, బాలగాని శేఖర్ పాల్గొన్నారు.




# జనగామలో ఫుడ్ బ్యాంక్, నైట్ షెల్టర్ ఏర్పాటు చేయాలి

## జనగామ కమిషనర్‌కు అమ్మ ఫౌండేషన్ విజ్ఞప్తి

**జనగామ, జూలై 25(మన చౌరాస్తా) :** నిరుపేదలు, అనాథలు, మతిస్థిమితం లేని వారికి సహాయం అందించేందుకు జనగామ జిల్లా కేంద్రంలో 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్' (దయగల గోడ), ఫుడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్, రూ. 5 భోజన క్యాంటీన్, నైట్ షెల్టర్ హోమ్‌లను ఏర్పాటు చేయాలని కోరుతూ జనగామ మున్సిపల్ కమిషనర్‌కు రాజశేఖర్ రెడ్డికి 'అమ్మ ఫౌండేషన్' ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేదలకు మంచి బట్టలు, ఆహారం అందుబాటులో ఉండేలా స్థలం కేటాయించాలని, అలాగే రైల్వే స్టేషన్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఫుడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్ ఏర్పాటుకు అనుమతివ్వాలని కోరారు. జనగామ జిల్లా కేంద్రానికి ప్రతిరోజూ వేలాది మంది వస్తుంటారని, ప్రభుత్వ, మాతా శిశు ఆసుపత్రుల వద్ద నిరుపేదల కోసం ఇంద్రమ్మ క్యాంటీన్ (రూ. 5 భోజనం) ఏర్పాటు ఎంతో అవసరమని పేర్కొన్నారు. అలాగే దూర ప్రాంతాల నుండి వచ్చే నిరుపేదలు, కార్మికుల సౌకర్యార్థం నైట్ షెల్టర్ హోమ్ నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ మారబోయిన పాండు యాదవ్, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ప్రధాన కార్యదర్శి వంగ భీమ్‌రాజ్, ఉపాధ్యక్షుడు కోయాడ రవి, ఫౌండేషన్ ప్రతినిధులు పండుగ నరేష్, బింగి నరసింహులు, మంద కిరణ్, సిద్ధిరాల చందు, పిట్టల కృష్ణ, గూగులోత్ ప్రభాకర్, బొల్లం కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# 28న ఉచిత గుండె జబ్బుల పరీక్షా శిబిరం

**జనగామ, జూలై 25 (మన చౌరాస్తా) :** జనగామ జిల్లా కేంద్రంలోని ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ లో ఈ నెల 28 మంగవారం ఉదయం 10 గం. లకు ఉచిత గుండె సంబంధిత వ్యాధుల పరీక్షా శిబిరం ఒమేగా హాస్పిటల్స్ హైదరాబాద్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ శాఖ, లయన్స్ క్లబ్ జనగామ ఆబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ డా. డి. లవకుమార్ రెడ్డి తెలిపారు. ఒమేగా హాస్పిటల్స్ హైదరాబాద్ కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డా. ఏ .నాగర్ వారి బృందం పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారు. బీపీ, ఇ సి జి, 2డి ఎకో స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారని ఒమేగా హాస్పిటల్స్ పి ఆర్ ఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. వయోవృద్ధులు, అవసరార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని అన్నారు. ముందస్తు గా మీ పేరు నమోదు చేయడానికి డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు సెల్ నెంబర్ 9396723272 కు కాల్ చేసి తెలుప వచ్చునని వారు తెలిపారు.

## శ్రీ ఉమామహేశ్వర ఆలయంలో

# డీసీపీ ప్రత్యేక పూజలు

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లా గుండగడ్డ కాలనీలోని శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో నిర్వహించిన సహస్ర ఘటాభిషేక మహోత్సవంలో జనగామ జిల్లా డీసీపీ రాజమహేంద్ర నాయక్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నీటితో నింపిన మండపంలో ప్రతిష్ఠించిన శివలింగం, పార్వతీదేవి సన్నిధిలో డీసీపీ చేతుల మీదుగా విశిష్ట దీపారాధన నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో డీసీపీ భక్తిశ్రద్ధలతో దీపం వెలిగించి స్వామివారికి హారతి సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఉమామహేశ్వర స్వామిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు డీసీపీకి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.



# కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి తరలివారండి

## బీజేపీ రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి

**జనగామ, జూలై 25 (మన చౌరాస్తా) :** పెంబర్తి, ఎల్లంల, సిద్దంకి గ్రామాల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి కేశపురం రవిరాజా ఆధ్వర్యంలో కొమురవెల్లి దేవస్థానం రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రాలను గ్రామాల్లోని ప్రముఖులకు, భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకులు కేవీఎల్ఎన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేడు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కొమురవెల్లి రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవానికి కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు తెలిపారు. కావున భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శానబోయిన శివరాజ్ యాదవ్, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సిద్ధి లింగం, బుడిగే శ్రీనివాస్, ఎల్లముల కురుమ సంఘం అధ్యక్షుడు సత్తయ్య, పెద్ద కురుమ చంద్రయ్య, పద్మ వంశీ, SWCS అధ్యక్షుడు బీర్రు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# కలెక్టర్ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

## సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

**జనగామ, జూలై 25 (మన చౌరాస్తా) :** జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తన నియంతృత్వ వైఖరిని వీడి, రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పరిపాలన కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జనగామలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సమస్యలపై ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులు, సీపీఎం నేతలపై కలెక్టర్ వ్యక్తిగత కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద పార్కింగ్ ఆంక్షలతో ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని, దళిత, బీసీ మహిళల ఉపాధిని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. ఇసుక, మట్టి రవాణాపై ఆంక్షల వల్ల ట్రాక్టర్లు, జేసీబీ కార్మికులు రోడ్డున పడుతున్నారని, వీటిని ప్రశ్నిస్తే కలెక్టర్ అహంకారపూరితంగా వ్యవహరిస్తూ కేసులతో బెదిరిస్తున్నారని విమర్శించారు. మల్లన్న గుడి వద్ద సర్వే నంబర్ 401 ప్లాట్ల బాధితుల సమస్యపై పార్టీ తరఫున స్పందిస్తే, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపిని బద్నాం చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా జిల్లా పౌర సంబంధాల అధికారి చేత పత్రికా ప్రకటన చేయించడం సరికాదని, దీనిపై అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, భూక్యా చందు నాయక్, పల్లెర్ల లలిత తదితరులు పాల్గొన్నారు.



